సాక్షి జగిత్యాల

సోమవారం ౹ 2 ౹ సెప్టెంబర్ ౹ 2024

జిల్లాలో వర్షపాతం ఇలా..

శనివారం అర్ధరాత్రి 8 గంటల నుంచి ఆదివారం ఉదయం 8 గంటల వరకు (మిల్లీమీటర్లలో..)		ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు (మి.మీలో	
ఇబ్రహీంపట్నం	35.3	మేడిపల్లి	85
మల్లాపూర్	35.2	జగిత్యాలరూరల్	84.3
రాయికల్	50.3	ధర్మపురి	79.9
బీర్పూర్	12.6	పెగడపల్లి	78.0
సారంగాపూర్	32.9	మెట్‌పల్లి	76.4



న్యూస్‌రీల్

నేటి ప్రజావాణి రద్దు



కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాలటౌన్: భారీ వర్షాల నేపథ్యంలో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నామని కలెక్టర్ సత్యప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటలు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, అధికారులు సహాయక చర్యల్లో నిమగ్నమై ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడిగా వెంకటరెడ్డి



ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న వెంకటరెడ్డి

జగిత్యాలరూరల్: జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం ఎన్నికలను ఆదివారం జగిత్యాల అర్బన్ మండలంలోని రెడ్డి సంక్షేమ సంఘం కల్యాణ మండపంలో నిర్వహించారు. ఎన్నికల అధికారిగా ఎన్నం నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో చేపట్టారు. ఇందులో రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా కొప్పెర వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కిష్టంపేట రాంచందర్ రెడ్డి, కోశాధికారి నేరెళ్ల భూమారెడ్డి, ఉపాధ్యక్షుడిగా గడ్డం చంద్రశేఖర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా వెల్మ నవీన్ రెడ్డి విజయం సాధించారు. మరో ఆరుగురి కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

ఒబులాపూర్‌ను సందర్శించిన అడిషనల్ కలెక్టర్



వరదనీటిని పరిశీలిస్తున్న గౌతంరెడ్డి

మల్యాల: మండలంలోని నూకపల్లి, ఒబులాపూర్ గ్రామాల్లో జిల్లా అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) గౌతంరెడ్డి ఆదివారం పర్యటించారు. గ్రామాల్లో వరదనీటి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. నూకపల్లి మధ్య నుంచి వెళ్తున్న వరదనీటిని పరిశీలించారు. ఒబులాపూర్‌లో కల్వర్టుపై నుంచి నీరు వెళ్తుండడంతో రోడ్డు తొలగించి, వరదనీటిని మళ్లించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వరదనీటిలో వాహనదారులు వెళ్లవద్దని, పిల్లలను బయటకు పంపవద్దని సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ స్వాతి, కార్యదర్శులు ఉన్నారు.

పద్మశాలీ సంఘం అధ్యక్షుడిగా ప్రసాద్

కోరుట్ల: కోరుట్ల పద్మశాలీ సంఘం ఎన్నికల్లో అధ్యక్షుడిగా గుంటుక ప్రసాద్ ఎన్నికయ్యారు. గుడ్ల మనోహర్‌పై 414 ఓట్ల తేడాతో విజయం సాధించినట్లు ఎన్నికల అధికారులు అందె శివప్రసాద్, బోగ శ్రీధర్ తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా బండ్ల రవి, ఉపాధ్యక్షునిగా కట్కం వినయ్, సహాయ కార్యదర్శిగా గోసికొండ కుమారస్వామి, కోశాధికారిగా అందె రాజ్‌కుమార్ ఎన్నికయ్యారు. యువత అధ్యక్షుడిగా జక్కుల ప్రవీణ్ ఎన్నికైనట్లు తెలిపారు. మొత్తం 4576 ఓట్లకు గాను 2418 ఓట్లు పోలయ్యాయి.

వర్ష బీభత్సం



జిల్లాకేంద్రంలోని వెంకటాద్రినగర్ వద్ద గల లోలెవల్ వంతెనపై ప్రవహిస్తున్న వరదనీరు

జగిత్యాల/జగిత్యాలటౌన్/సారంగాపూర్/రాయికల్/జగిత్యాలక్రైం/కోరుట్ల: శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం సాయంత్రం వరకు జిల్లావ్యాప్తంగా వర్షం బీభత్సం సృష్టించింది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షంతోపాటు పిడుగులు పడ్డాయి. విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. పిడుగుపాటుకు ఫ్యాన్లు, టీవీలు కాలిపోయాయి. జిల్లాకేంద్రంలోని లోతట్టు ప్రాంతాలు, కాలనీలు జలమయ్యాయి. రోడ్లు, డ్రైనేజీలు పొంగి పొర్లాయి. గోవింద్‌పల్లి నుంచి వెంకటాద్రినగర్‌కు వెళ్లే లోలెవల్ వంతెనపై నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో వెంకటాద్రినగర్ వాసులకు సంబంధాలు తెగిపోయాయి. కాలనీప్రజలు పాలు, కూరగాయలకు ఇబ్బంది పడ్డారు. లోతట్టు ప్రాంతాలైన గాంధీనగర్, ఇందిరానగర్, దగ్గులమ్మ, కృష్ణానగర్, చిలుకవాడ తదితర ప్రాంతాల్లోని రోడ్లు జలమయ్యాయి.

- పొంగిపొర్లిన వాగులు, వంకలు
- మునిగిపోయిన లోలెవల్ వంతెనలు
- వెంకటాద్రినగర్‌కు నిలిచిన రాకపోకలు

అంతకంతకూ పెరుగుతున్న గోదావరి ఉధృతి

- బీర్పూర్ మండలం కమ్మునూర్ వద్ద గోదావరి ఉధృతి అంతకంతకూ పెరుగుతోంది. ప్రవాహాన్ని తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్సారెస్పీ డీఈ చక్రూనాయక్ పరిశీలించారు. సోమవారం ఉదయం వరకు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు.

గోదావరి తీర ప్రాంతాలకు వెళ్లొద్దు

- గోదావరి తీర ప్రాంతాలకు మత్స్యకారులు, అటవీప్రాంతాలకు గొర్రెల కాపరులు వెళ్లవద్దని జిల్లా అడిషనల్ కలెక్టర్ రాంబాబు కోరారు. రాయికల్‌లోని పెద్ద చెరువు, ఇటిక్యాల, మూటపల్లి, సింగర్‌రావుపేట కల్వర్టులను ఆదివారం పరిశీలించారు. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని కోరారు. తహసీల్దార్ ఖయ్యూం, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్, ఎంపీవో సుష్మ, డీఈ భాస్కర్, పంచాయతీరాజ్ ఏఈ ప్రసాద్ ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. జగిత్యాల అర్బన్ మండలం పెరకపల్లి వద్ద వరద పరిస్థితిని తెలుసుకున్నారు. ప్రజలు వరద ఉధృతిని అంచనా వేయకుండా దాటే సాహసం చేయవద్దన్నారు. ఎస్పీ సీఐ అరీఫ్‌అలీఖాన్, రూరల్ సీఐ కృష్ణారెడ్డి, ఎస్సై సదాకర్ ఉన్నారు.

లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్

- భారీ వర్షాలతో జలమయంగా మారిన కోరుట్ల మున్సిపల్‌లోని లోతట్టు ప్రాంతాలను కలెక్టర్ సత్యప్రసాద్ ఆదివారం సందర్శించారు. ప్రకాశంరోడ్, ఝాన్సీరోడ్, ముత్యాలవాడ ఏరియాలను పరిశీలించారు. రోడ్లపైకి నీరు చేరడం.. ఇళ్లలోకి నీరు వస్తున్న తీరును గమనించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కమిషనర్ తిరుపతిని ఆదేశించారు. రాంనగర్, బిలాల్‌పురాకు చెందిన ముంపు బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అనంతరం మేడిపల్లి మండలంలో పర్యటించారు. కొండాపూర్–విలయతాబాద్ రోడ్డుపై వరదనీరు చేరడంతో శనివారం అంబులెన్స్ రాక.. మోకాళ్లలోతు నీటిలో గర్భిణి నడిచివెళ్లిన ప్రాంతాన్ని పరిశీలించి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భీమారం మండలం కమ్మరిపేట బ్రిడ్జిని పరిశీలించారు. వర్షాలకు మండలంలోని అన్ని గ్రామాల్లో చెరువులు, కుంటలు అలుగు పోస్తున్నాయి. మేడిపల్లిలో ఓ పెంకుటిల్లు గోడ కూలింది. ఆ ఇంట్లో ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.



యావర్ రోడ్డులో ప్రవహిస్తున్న డ్రైనేజీ, వరదనీరు









రాయికల్‌లో కల్వర్టును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు, కోరుట్లలో లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్, కథలాపూర్: ఇంట్లో చేరిన నీటిని తొలగిస్తున్న మహిళ, ఇంట్లోకి చేరిన నీరు



రాయికల్: ట్రాక్టర్‌లో కూలీల తరలింపు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

జగిత్యాల: భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. చెరువులు, వాగుల ప్రాంతాల్లో ఆస్తి, ప్రాణనష్టం వాటిల్లకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. చెరువుల వద్ద నీటినిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి లోతట్టు ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. మున్సిపల్, పంచాయతీరాజ్ అధికారులు గ్రామాల్లో, పట్టణాల్లో శిథిలావస్థలో ఉన్న భవనాల నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. లోతట్టు వంతెనల వద్ద నీటి ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ.. సైన్‌బోర్డులు, బారికేడ్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాకు ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. పరిస్థితి మెరుగుపడే వరకు చెరువుల్లో చేపలు పట్టేందుకు ఎవరికీ అనుమతి ఇవ్వవద్దన్నారు.

ముందస్తు చర్యలు చేపట్టాలి

వర్షాల దృష్ట్యా జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించారు. వాగులు, చెరువులు నిండుకుండలా ఉన్నాయని, పిల్లలు, యువత అటువైపు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అధికారులు అప్రమత్తమై అవసరమైన చర్యలు చేపట్టి, ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా చూడాలన్నా రు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తక్షణ సహా యం కోసం 1804257620కు సమాచారం ఇవ్వాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు రాంబాబు, గౌతంరెడ్డి, ఆర్డీవోలు ఆనంద్‌కుమార్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత చదువులకు నజరానా

- విద్యార్థులను వరించిన ప్యాకేజీలు



కుటుంబ సభ్యులతో సుజిత్‌కుమార్



తల్లిదండ్రులతో అక్షర

ధర్మపురి: హైదరాబాద్‌లో ఇటీవల నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో ధర్మపురి విద్యార్థులు ప్రతిభ చాటారు. ఇద్దరు ఎంపిక కాగా.. వారిలో ఒకరు రూ.33లక్షలు, మరొకరు రూ.12.07లక్షల ప్యాకేజీతో ఎంపికయ్యారు. ధర్మపురికి చెందిన అక్కెనపెల్లి సునీల్‌కుమార్–అనిత దంపతుల కుమారుడు సుజిత్‌కుమార్. సునీల్ రైస్‌మిల్‌లో భాగస్వామి. అనిత గృహిణి. సుజిత్ హైదరాబాద్‌లో బీటెక్ మూడో సంవత్సరం పూర్తి చేశాడు. ఇటీవల నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో సర్వీస్ నౌవ్ కంపెనీ వారు విద్యార్థి ప్రతిభను గుర్తించారు. పెద్ద మొత్తంలో రూ.33లక్షల వార్షిక ప్యాకేజీ కింద ఎంపికయ్యాడు. సుజిత్ పదిలో 9.8 జీపీఏ, ఇంటర్‌లో 984 మార్కులు, ఎంసెట్‌లో 3440 ర్యాంకు సాధించాడు.

అక్షరకు రూ.12.07లక్షలు..

ధర్మపురికి చెందిన ముత్తినేని సత్తయ్య(ప్రభుత్వ ఉపాధ్యాయుడు)–వినోద దంపతుల కూతురు అక్షర. హైదరాబాద్‌లోని ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ ఇన్ డేటా సైన్స్(సీఎస్ సీ–డీఎస్)లో సీటు సాధించింది. బీటెక్ మూడో సంవత్సరం పూర్తి చేసింది. ఇటీవల నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో చబ్ బిజినెస్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్ కంపెనీకి రూ.12.07లక్షల వార్షిక ప్యాకేజీతో ఎంపికైంది. అక్షర పదిలో 9.8 జీపీఏ, ఇంటర్‌లో 986 మార్కులు, ఎంసెట్ ర్యాంకు 4,600 సాధించింది.

తల్లిదండ్రుల దీవెనలతో..



తల్లిదండ్రుల దీవెనలతోనే ఈ గౌరవం దక్కింది. సర్వీస్ నౌవ్ అనే కంపెనీలో రూ.33లక్షల ప్యాకేజీకి ఎంపికయ్యా. ప్రస్తుతం సీబీఐటీ కళాశాలలో 4వ సంవత్సరం చదువుతున్న. ప్యాకేజీ రాకముందు రెండు నెలలు ఇంటర్న్ షిప్‌కు సెలెక్టయ్యా. రానున్న రోజుల్లో గూగుల్, అమేజాన్ లాంటి కంపెనీల్లో చేరాలనేది లక్ష్యం.

– సుజిత్‌కుమార్

డేటా సైన్స్ రంగంలో రాణిస్తా



కష్టపడి చదివి మరింత ముందుకు సాగుతా. తండ్రి ప్రభుత్వ ఉపాధ్యాయుడు. తల్లి గృహిణి. చబ్ బిజినెస్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్ కంపెనీ వారు ఏర్పాటు చేసిన పరీక్ష పోటీల్లో ప్రతిభ చాటి రూ.12.07లక్షల ప్యాకేజీ కింద ఎంపికయ్యా. సెప్టెంబర్ 5 నుంచి శిక్షణ తరగతులకు హాజరౌతా. డెటా సైన్స్ రంగంలో ఉన్నత స్థాయికి చేరడం లక్ష్యం.

– అక్షర

పేదల బియ్యం పక్కదారి

- లబ్ధిదారుల నుంచి యథేచ్ఛగా బియ్యం కొనుగోలు
- వ్యాపారులకు కొందరు రేషన్ డీలర్ల మద్దతు?
- కొన్నిచోట్ల రేషన్ దుకాణాల వద్దే బియ్యం సేకరణ
- పట్టించుకోని అధికార యంత్రాంగం



వేంపేటలో రేషన్ బియ్యం పట్టుకున్న పోలీసులు(ఫైల్)

మెట్‌పల్లిరూరల్: పేదలకు చేరాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది. పేదలకు దక్కాల్సిన బియ్యం లాభసాటి వ్యాపారంగా మారుతోంది. కొందరు వ్యాపారులు లబ్ధిదారుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఎక్కువ ధరకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. ఏళ్ల తరబడి పెద్ద మొత్తంలో దందా సాగుతున్నా అధికారులు నామమాత్రపు దాడులతో సరిపెడుతున్నారు. దీంతో చౌక బియ్యం మాఫియా మరింత రెచ్చిపోతుందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మెట్‌పల్లి డివిజన్‌లో రాత్రి సమయాల్లో టన్నుల కొద్ది రేషన్ బియ్యం ఇతర ప్రాంతాలకు తరలిపోతున్నాయి.

కిలో రూ.10 నుంచి రూ.15కు కొనుగోలు చేసి..

రేషన్‌బియ్యం దందాలో మెట్‌పల్లి పట్టణానికి చెందిన కొందరు కీలక పాత్ర పోషిస్తున్నారు. వీరే పట్టణంతో పాటు మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ మండలాల్లో కొందరు దళారులను ఏర్పాటు చేసి లబ్ధిదారుల నుంచి బియ్యం సేకరిస్తున్నారు. కిలోకు రూ.10 నుంచి రూ.15 వరకు కొనుగోలు చేస్తున్నారు. కొనుగోలు చేసిన మొత్తాన్ని ఇతర ప్రాంతాలకు తరలించి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు. ఈ బ్లాక్ మార్కెట్ వ్యాపారులకు ప్రధానంగా కొందరు రేషన్ డీలర్ల మద్దతు ఉండడంతోనే రేషన్ బియ్యం పెద్ద మొత్తంలో పక్కదారి పడుతున్నాయన్న ప్రచారం జరుగుతోంది. చాలా ప్రాంతాల్లో దళారులు రేషన్ దుకాణాల వద్దే తిష్ట వేసి బియ్యం కొంటున్నారు. ఇదిలా ఉండగా కొన్ని దుకాణాల్లో లబ్ధిదారులు వేలిముద్ర వేయగానే దళారులే తమ వద్ద ఉన్న ఖాళీ సంచుల్లో బియ్యం సేకరించుకుంటున్నట్లు తెలిసింది. ఇదంతా బహిరంగంగానే జరుగుతున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మూములుగా తీసుకుంటున్న అధికారులు

రేషన్ బియ్యం దందా పెద్ద మొత్తంలో నడుస్తున్నా సంబంధిత శాఖల అధికారులు మిన్నకుండిపోవడం, 'మాములు'గా వ్యవహరించడంతో అక్రమార్కులకు అడ్డూ అదుపులేకుండా పోతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ దందాకు కొందరి సహకారం ఉండడం, ఎవరి నుంచి ఇబ్బందులు లేకుండా చూసుకుంటామనే ధీమా కల్పించడంతో అక్రమార్కులు యథేచ్ఛగా దందా సాగిస్తున్నట్లు తెలుస్తోంది.

శివారు ప్రాంతాలే అడ్డా

ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యాన్ని యథేచ్ఛగా కొనుగోలు చేస్తున్న అక్రమార్కులు ఆ బియ్యాన్ని ద్విచక్రవాహనాలు, ఆటోల్లో తరలిస్తూ గ్రామ శివారులు, పట్టణ శివారుల్లోని రహస్య ప్రాంతాల్లో నిల్వ చేస్తున్నారు. పెద్ద మొత్తంలో బియ్యం సేకరణ పూర్తయ్యాక రాత్రి సమయాల్లో జిల్లాలు దాటించేస్తున్నారు.

పాత పెన్షన్ కోసం పోరు



ర్యాలీలో ఉద్యోగ జేఏసీ నాయకులు

- సీపీఎస్ రద్దు చేయాల్సిందే..
- ఉద్యోగ జేఏసీ పెన్షన్ విద్రోహ దినం

జగిత్యాలటౌన్: సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలని కోరుతూ ఉద్యోగ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. వర్షాన్ని కూడా లెక్క చేయకుండా ఆదివారం నల్లబ్యాడ్జీలు ధరించిన ఉద్యోగులు మినీ స్టేడియం నుంచి తహసీల్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. జేఏసీ జిల్లా చైర్మన్ భోగ శశిధర్, ప్రధాన కార్యదర్శి గంగుల సంతోష్ మాట్లాడుతూ ఉద్యోగుల పాలిట శాపంగా మారిన కంట్రీబ్యూటరీ పెన్షన్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ.. సెప్టెంబర్ 1వ తేదీని పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పెన్షన్ ఉద్యోగుల హక్కు అన్నారు. కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు మిర్యాల నాగేందర్‌రెడ్డి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు బైరం హరికిరణ్, టీజీవో జిల్లా కార్యదర్శి మామిడి రమేశ్, ట్రెసా అధ్యక్షుడు ఎండి వకీల్, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్, నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చంద్రయ్య, ముజాహిద్ ఖాన్, సీపీఎస్ఈయూ అధ్యక్ష, కార్యదర్శులు గంగాధరి మహేశ్, సర్వ సతీశ్, గొల్లపల్లి మహేష్‌గౌడ్, ఎంపీవో సంఘం అధ్యక్షుడు కందుకూరి రవిబాబు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు బాధ్యత ప్రభుత్వానిదే..

సీపీఎస్ రద్దు బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని తపస్ జిల్లా అధ్యక్షుడు బోనగిరి దేవయ్య అన్నారు. సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. తపస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అయిల్నేని నరేందర్‌రావు, ఉపాధ్యక్షుడు ఒడ్నాల రాజశేఖర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉరేసుకొని బలవన్మరణం

మానకొండూర్: ఖాదర్‌గూడెం గ్రామానికి చెందిన గౌడ శంకర్(54) అనే వ్యక్తి ఇంట్లో ఉరేసుకొని ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. శంకర్ కొన్నేళ్లుగా కూలి పనులు చేస్తూ గ్రామంలోని ఇంటి వద్ద ఒంటరిగా జీవిస్తున్నాడు. ఆదివారం ఇంట్లో ఉరేసుకున్నాడు. ఒంటరి జీవితాన్ని భరించలేక, అనారోగ్య సమస్యలతో ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని గ్రామస్తులు భావిస్తున్నారు.

జ్వరంతో మహిళ మృతి


శ్రీలత(ఫైల్)

ముత్తారం(మంథని): మండల కేంద్రానికి చెందిన మామిడి శ్రీలత(48) జ్వరంతో ఆదివారం మృతిచెందింది. పది రోజుల క్రితం శ్రీలతకు జ్వరం వచ్చింది. స్థానిక ఆర్‌ఎంపీల వద్ద చూపించారు. నయం కాకపోవడంతో గోదావరిఖనిలోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడి నుంచి వరంగల్‌కు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు.. జ్వరంతోపాటు లివర్, పచ్చలతో బాధపడుతున్నట్లు నిర్ధారించారు. చికిత్స అందిస్తుండగానే చనిపోయిందని స్థానికులు తెలిపారు. మృతురాలికి భర్త శ్రీనివాస్, కొడుకు కార్తిక్, కుమార్తె కల్యాణి ఉన్నారు.

డెంగీతో గల్ఫ్ కార్మికుడు..


సందేశ్(ఫైల్)

మల్లాపూర్: డెంగీ జ్వరంతో చికిత్స పొందుతూ గల్ఫ్ కార్మికుడు మైలారపు సందేశ్(25) ఆదివారం మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. చిట్టాపూర్ గ్రామానికి చెందిన మైలారపు రాములు–లక్ష్మీ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఉపాధి కోసం తండ్రి రాములుతోపాటు ఇద్దరు కుమారులు గల్ఫ్ దేశాలకు వలస వెళ్తున్నారు. చిన్న కుమారుడు సందేశ్(25) నెల రోజుల క్రితం సెలవుపై స్వగ్రామానికి వచ్చాడు. వారం రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతున్న సందేశ్ మొదట స్వగ్రామంలో ప్రాథమిక చికిత్స తీసుకున్నాడు. నయం కాకపోవడంతో కుటుంబ సభ్యులు మెట్‌పల్లిలో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. రక్త పరీక్షలు నిర్వహించి డెంగీ పాజిటివ్‌గా నిర్ధారించి చికిత్స అందించినా.. రక్త కణాలు తగ్గి పరిస్థితి విషమంగా మారడంతో నిజామాబాద్‌కు తీసుకెళ్లారు. అక్కడే చికిత్స పొందుతూ అర్ధరాత్రి ఒంటి గంటకు మృతిచెందాడు. గల్ఫ్ నుంచి తండ్రి, అన్న సోమవారం స్వగ్రామానికి చేరుకున్నాకే సందేశ్ అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

వ్యక్తిపై అదనపు కట్నం కేసు

జమ్మికుంట: అదనపు కట్నం కోసం వేధింపులకు పాల్పడుతున్న ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ వరంగంటి రవి తెలిపారు. నాగంపేట సరోజన, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మచిలీపట్నంకు చెందిన మత్తు వెంకటనాగరాజుకు 2009లో వివాహం జరిగింది. వీరికి బాబు, పాప ఉన్నారు. కొన్ని సంవత్సరాలుగా అదనపు కట్నం తీసుకురావాలని భర్త వేధింపులకు పాల్పడుతున్నాడని బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

మద్యం పట్టివేత

జమ్మికుంట: ఓ బెల్టు షాపులో పోలీసులు సోదాలు నిర్వహించి అక్రమంగా కలిగి ఉన్న మద్యం సీజ్ చేసి నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివేక్ తెలిపారు. అరెల్లి రాజమౌళి అనే వ్యక్తి అక్రమంగా నిర్వహిస్తున్న బెల్టు షాపులో పోలీసులు సోదాలు నిర్వహించారు. రూ.7,300 విలువ చేసే మద్యాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేశారు.

గల్ఫ్ మోసాలు

జగిత్యాల రూరల్ మండలంలోని రెండు గ్రామాలకు చెందిన ముగ్గురు యువకులు 8 నెలల క్రితం యూరప్ దేశానికి వెళ్లేందుకు ఓ ట్రావెల్స్ యజమానికి రూ.5లక్షలు చెల్లించారు. సదరు యువకులను ఇప్పటివరకు ట్రావెల్స్ యజమాని యూరప్ పంపించలేదు.

ఓ ట్రావెల్స్ యజమాని రాజన్న సిరిసిల్ల జిల్లా మల్కపేటకు చెందిన ఓ వ్యక్తిని గల్ఫ్ దేశానికి పంపిస్తామని రూ.80వేలు తీసుకొని చాలా రోజులుగా ఇబ్బంది పెడుతున్నాడు.

బీర్‌పూర్ మండలానికి చెందిన ఇద్దరు యువకులు యూరప్ వెళ్లేందుకు నిజామాబాద్ జిల్లాకు చెందిన ఓ వ్యక్తికి రూ.15లక్షలు చెల్లించారు. డబ్బులిచ్చి ఏడాది గడుస్తున్నా.. ఇప్పటికీ యూరప్ పంపించకుండా మోసానికి పాల్పడుతున్నారు.. ఇలా జిల్లాలో గల్ఫ్ ట్రావెల్స్ యాజమాన్యాలు అమాయక యువకుల నుంచి డబ్బులు వసూలు చేస్తూ ముప్పుతిప్పలు పెడుతున్నాయి.

- జిల్లాలో రోజుకో ఇంటర్వ్యూ
- యూరప్ దేశాల పేరిట భారీగా వసూళ్లు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని సంబంధిత అధికారులు
- జిల్లాలో 33 గల్ఫ్ ట్రావెల్స్‌లకు అనుమతులు


పీవోఈ అధికారికి ఫిర్యాదు చేస్తున్న పాషా(ఫైల్)



హైదరాబాద్‌లోని పీవోఈ కార్యాలయం

జగిత్యాలక్రైం: జిల్లాలో గల్ఫ్ ట్రావెల్స్‌లు విచ్చలవిడిగా పెరిగిపోయాయి. నిరుద్యోగ యువకులను ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశాలకు పంపిస్తామంటూ నమ్మిస్తూ అందినకాడికి వసూళ్లు చేసుకుంటూ కొంతమంది మోసానికి పాల్పడుతున్నారు. దీంతో బాధిత యువకులు అటు గల్ఫ్ వెళ్లక.. ఇటు అప్పులు పెరిగిపోయి నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గల్ఫ్ మోసాలు పెరుగుతుండటంతో ఇటీవల పోలీసు శాఖ ప్రొటెక్షన్ ఆఫ్ ఇమిగ్రెంట్స్ అధికారులతో జిల్లా కేంద్రంలోని సుమంగళి గార్డెన్స్‌లో గల్ఫ్ బాధితులకు అవగాహన సదస్సు కూడా నిర్వహించారు.

పెరుగుతున్న మోసాలు

జిల్లాలో గల్ఫ్ దేశాలకు పంపించేందుకు 33 మంది గల్ఫ్ ట్రావెల్స్ అనుమతులు పొందారు. వీరు కాకుండా సుమారు 400 నుంచి 480 మంది గల్ఫ్ ఏజెంట్లు జిల్లాలో వారి కార్యకలాపాలను కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. నిరుద్యోగ యువకులను గల్ఫ్ పంపిస్తామంటూ మోసాలు పెరిగిపోతున్నాయి. దీంతో బాధిత యువకులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

నిబంధనలు గాలికి..

గల్ఫ్ దేశాలకు పంపించేవారు అక్కడి కంపెనీ వివరాలు మొదట భారత రాయబార కార్యాలయంలో సమర్పించాలి. అక్కడి నుంచి పరిశీలన అనంతరం భారత్‌లోని పీవోఈ కార్యాలయాలకు వారి వివరాలు సమర్పిస్తారు. ఇక్కడ ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు ప్రతి ట్రావెల్స్ యజమాని పీవోఈ (ప్రొటెక్టర్ ఆఫ్ ఎమిగ్రెంట్స్) అధికారుల అనుమతి తీసుకోవాలి. అలాగే జిల్లాలో ఎస్పీ పోలీసుల అనుమతి కూడా తప్పనిసరిగా తీసుకోవాలి. కానీ కొంతమంది గల్ఫ్ ట్రావెల్స్ నిర్వాహకులు అనుమతులు లేకుండానే ఇష్టారాజ్యంగా ఇంటర్వ్యూలు నిర్వహిస్తూ మోసాలకు పాల్పడుతున్నారు.

పట్టించుకోని పీవోఈ అధికారులు

గల్ఫ్ మోసాలకు గురవుతున్న బాధితులు పీవోఈ అధికారులకు ఫిర్యాదు చేసినా ఏళ్ల తరబడి పట్టించుకోవడం లేదు. దీంతో రోజురోజుకు గల్ఫ్ మోసాలు పెరిగిపోతున్నాయి. బాధితులు ఫిర్యాదు చేస్తే పోలీసులు మాత్రం కేసులు నమోదు చేస్తున్నారు. పలువురు ట్రావెల్స్ యజమానులు చట్టంలో ఉన్న లొసుగులను ఆసరాగా చేసుకొని మోసాలకు పాల్పడుతున్నారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోలె..



గల్ఫ్ మోసాలకు పాల్పడినవారిపై బాధితులు పీవోఈకి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. జిల్లాలో చాలామంది నకిలీ ఏజెంట్ల చేతిలో మోసపోతున్నారు. మోసాలపై ఇటీవల జగిత్యాలకు వచ్చిన పీవోఈ అధికారి దృష్టికి తీసుకెళ్లారు.

– షేక్ చాంద్‌పాషా, గల్ఫ్ సామాజిక సేవకుడు

కాంగ్రెస్‌కు పతనం తప్పదు

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్


మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్, పక్కన రవీందర్ సింగ్, అనిల్, హరిప్రసాద్, మహేశ్, తిరుపతి

కరీంనగర్: అడ్డగోలు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ తొమ్మిది నెలల్లో చేసిందేమీ లేదని, రానున్న రోజుల్లో ప్రజాక్షేత్రంలో శృంగభంగం తప్పదని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ హెచ్చరించారు. ఆదివారం తారక హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ పెద్దపల్లి జిల్లా పర్యటనలో మాజీ సీఎం కేసీఆర్‌పై విమర్శలు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. కాంగ్రెస్ నేతలు గ్రూప్ కొట్లాటలతో ప్రజలను అయోమయం చేయడం తప్ప చేసిందేమీ లేదని ఆరోపించారు. రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ చెబుతున్న మాటలు అబద్ధమని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతన్నకు బీఆర్‌ఎస్ పార్టీ బాసటగా నిలిచిందన్నారు. గురుకులాల్లో 37 మంది విద్యార్థులు మృతిచెందారని, ఇదేనా సంక్షేమమంటూ కాంగ్రెస్‌పై ధ్వజమెత్తారు. కేసీఆర్‌ను విమర్శిస్తే సహించబోమని హెచ్చరించారు. మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్, అనిల్, హరిప్రసాద్, మహేశ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు అహిల్యాబాయి కృషి

- మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు


మాట్లాడుతున్న విద్యాసాగర్‌రావు

మెట్‌పల్లి: హిందూ ధర్మ పరిరక్షణకు అహిల్యాబాయి హోల్కర్ ఎంతో కృషి చేశారని మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు పేర్కొన్నారు. పట్టణంలోని వీఆర్‌ఎం గార్డెన్‌లో ఆదివారం సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో అహిల్యాబాయి హోల్కర్ త్రిశతాబ్ది జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విద్యాసాగర్‌రావు హాజరై మాట్లాడారు. ఇండోర్‌ను సుమారు 28 సంవత్సరాలు పాలించిన ఆమె ఎంతో సమర్థవంతురాలిగా పేరు తెచ్చుకున్నారన్నారు. శిథిలమైన ఎన్నో ప్రసిద్ధ దేవాలయాలను పునరుద్ధరించారని అన్నారు. మండల పరిషత్ పార్కులో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వేదిక రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్, మహిళా కన్వీనర్ కొరెడ్ల రుక్మిణి, బెజ్జారపు మురళి, పోహార్ తుక్కారాం, ముత్యాల వెంకట్‌రెడ్డి, ఓగులపు శేఖర్ తదితరులున్నారు.

పరామర్శ

ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన బీజేపీ కౌన్సిలర్ మర్రి పోచయ్య కుటుంబాన్ని విద్యాసాగర్‌రావు పరామర్శించారు.

ఆధునిక వైద్యాన్ని అందిపుచ్చుకోవాలి

- ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కాళీప్రసాద్


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కాళీప్రసాద్

కరీంనగర్ టౌన్: వైద్యరంగం అత్యంత వేగంగా అధునాతన టెక్నాలజీ వైపు పరుగులు తీస్తోందని, దానికి తగ్గట్టుగానే వైద్యులు ఆధునిక వైద్యాన్ని అందిపుచ్చుకోవాలని ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కాళీప్రసాద్ అన్నారు. ఆదివారం ఐఎంఏ కరీంనగర్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక హోటల్‌లో కంటిన్యూ మెడికల్ ఎడ్యుకేషన్(సీఎంఈ) సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన కాళీప్రసాద్ మాట్లాడుతూ.. కొత్తకొత్త వైరస్‌లు ప్రజలపై దాడి చేస్తూ వైద్యరంగానికి సవాళ్లుగా మారుతున్నాయని అన్నారు. వైరస్లను ఎదుర్కొనేందుకు వైద్యులు అన్నివిధాలా సమాయత్తం కావాలని సూచించారు. హైదరాబాద్ జెనిసిస్ హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ నర్మద కటకం సంతాన సాఫల్యత శాస్త్రీయ మార్పుల గురించి వివరించారు. డాక్టర్ కవిత నల్లపరెడ్డి న్యూక్లియర్ మెడిసిన్‌కి సంబంధించిన ప్రగతి గురించి వివరించారు. డాక్టర్ రవీంద్రరెడ్డి వైద్య సంబంధిత పాత, కొత్త మార్పులు, వైద్య చట్టాల సంబంధిత అంశాలపై అవగాహన కల్పించారు. వెల్‌నెస్ హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ శైలేశ్ పక్షవాతం వైద్యంలో సమయం విలువ గురించి, డాక్టర్ రవీంద్ర పాటిల్ విటమిన్–డి ప్రాధాన్యంపై వివరించారు. ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రామ్‌కిరణ్, ఐఎంఏ జిల్లా కార్యదర్శి వెంకటరెడ్డి, వైద్యులు మల్లికార్జున, శ్యాంసుందర్, విజయేందర్‌రెడ్డి, జగన్మోహన్‌రావు, లక్ష్మీనారాయణ, హరికిషన్, రవీందర్రావు తదితరులు పాల్గొన్నారు.

ఆకాశ మేఘాలు


కొండలను తాకుతున్న మేఘాలు

ఒకవైపు కమ్ముకుంటున్న కారుమబ్బులు.. రెండ్రోజులుగా ఏకధాటిగా కురుస్తున్న వానలు.. పొంగుతున్న వాగులు, వంకలు.. పచ్చనిచెట్ల ఆకులపై నీటిబిందువులు.. మరోవైపు.. గాలిలో తేలియాడుతున్న తెల్లని మేఘాలు.. అప్పడప్పుడూ సమీపంలోని చెట్లు, గుట్టలను తాకుతూ ప్రయాణం.. ప్రకృతి రమణీయతకు అద్దంపడుతున్న దృశ్యాలు.. పెద్దపల్లి పట్టణ శివారులో 'సాక్షి' కెమెరాకు ఇలా చిక్కాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

వైభవంగా మహా లింగార్చన


మహా లింగార్చన నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

వేములవాడ: రాజన్న ఆలయంలో మాస శివరాత్రిని పురస్కరించుకొని ఆదివారం రాత్రి మహా లింగార్చన వైభవంగా నిర్వహించారు. ఆలయ అధికారులు, అర్చకులు, భక్తులు, స్థానికులు పాల్గొన్నారు.

గుండెపోటుతో మాజీ సర్పంచ్ భర్త మృతి

కరీంనగర్‌రూరల్: ఎలబోతారం మాజీ సర్పంచ్ కట్ల లక్ష్మి భర్త గౌతమ్‌రెడ్డి(60) శనివారం రాత్రి గుండెపోటుతో మృతిచెందాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. కరీంనగర్‌లోని జ్యోతినగర్‌లో కుటుంబంతో కలిసి నివాసముంటున్నాడు. రెండు రోజుల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ వెళ్లిన గౌతమ్‌రెడ్డి శనివారం ఒక్కడే కరీంనగర్‌కు వచ్చాడు. ఆదివారం ఉదయం 8 గంటలకు భార్య లక్ష్మి ఫోన్ చేయగా.. సెల్ లిఫ్ట్ చేయకపోవడంతో ఇంటి పక్క ఉంటున్నవాళ్లకు సమాచారమందించా రు. తలుపులు తెరిచి లోపలికి వెళ్లి చూడగా.. గౌతమ్‌రెడ్డి బెడ్‌పై నుంచి కింద పడి మృతిచెందాడు. సమాచారమందుకున్న కుటుంబ సభ్యులు హైదరాబాద్ నుంచి హుటాహుటిన ఇంటికొచ్చి పరిశీలించారు. గుండెపోటుతో మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించడంతో గౌతమ్‌రెడ్డి మృతదేహాన్ని ఎలబోతారం తరలించారు. అయితే అమెరికాలో ఉంటున్న కూతురు ప్రవళిక వచ్చిన అనంతరమే అంత్యక్రియలు నిర్వహించాల్సి ఉండటంతో ఫ్రీజర్‌లో మృతదేహాన్ని భద్రపరిచారు. మృతుడికి భార్య లక్ష్మి, కొడుకు సందీప్‌రెడ్డి ఉన్నారు. పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నాయకులు గౌతమ్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు.

అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యలు


రంగాపూర్‌లో సిబ్బంది సహాయక చర్యలు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని ఓ ఇంట్లో ఆదివారం వరద నీరు చేరడంతో అగ్నిమాపక సిబ్బంది ఆ ఇంటికెళ్లి నీటిని ఫోర్ టేబుల్ పంపు ద్వారా బయటకు పంపించారు. స్థానికుల వివరాల ప్రకారం.. రంగపూర్ గ్రామంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మెరుగు కొమరమ్మ ఇంట్లోకి వరద నీరు రావడంతో.. ఒంటరిగా ఉన్న మహిళ హుజూరాబాద్ అగ్నిమాపక సిబ్బందికి ఫోన్ ద్వారా సమాచారమందించింది. సిబ్బంది ఇంట్లో నుంచి నీటిని బయటకు పంపించారు.

ఎగువ మా'నీటి' పరవళ్లు


పరవళ్లు తొక్కుతున్న నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టు


గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట మండలం నర్మాల ఎగువమానేరు ప్రాజెక్టు పొంగి పొర్లుతోంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి ఎగువ ప్రాంతాలైన కామారెడ్డి జిల్లా పాల్వంచ వాగు, సిద్దిపేట జిల్లా కూడవెల్లి వాగుల ద్వారా వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 31 అడుగులు(రెండు టీఎంసీలు) కాగా.. ఆదివారం సాయంత్రానికి పూర్తిస్థాయిలో నీరు చేరి మత్తడి పోస్తోంది. తహసీల్దార్ భూపతి, ఎస్సై రామ్మోహన్, ఎంపీడీవో రాజేందర్, ఇరిగేషన్ అధికారులు ప్రాజెక్టు దగ్గర పరిస్థితులను పరిశీలిస్తున్నారు. మానేరు వాగు పరివాహక ప్రాంత రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

మిడ్ మానేరుకు పోటెత్తిన వరద


మిడ్ మానేరు ప్రాజెక్టు

బోయినపల్లి(చొప్పదండి): బోయినపల్లి మండలం శ్రీరాజరాజేశ్వర (మిడ్ మానేరు) ప్రాజెక్టులోకి మూలవాగు, మానేరు వాగుల్లోంచి వరద పోటెత్తుతోంది. ఆదివారం రాత్రి 9 గంటల వరకు 46,891 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. మూలవాగు, మానేరువాగుల నుంచి 40,591 క్యూసెక్కుల వరద వస్తోంది. ఎల్లంపల్లి నుంచి వరదకాల్వ మీదుగా మరో 6,300 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో చేరుతోందని అధికారులు తెలిపారు. కరీంనగర్ ఎల్‌ఎండీ ప్రాజెక్టులోకి మోయతుమ్మెద వాగు నుంచి భారీగా వరద వస్తుందడంతో మిడ్‌మానేరు నుంచి నీటి విడుదల నిలిపివేశారు. కుడికాల్వ నుంచి అనంతగిరి ప్యాకేజీ–10లోకి నీటి విడుదల నిలిపివేశారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 16.215 టీఎంసీల మేర నీరు నిల్వ ఉన్నట్లు తెలిపారు.

దిగువ మానేరుకు పోటెత్తిన వరద



తిమ్మాపూర్(మానకొండూర్): ఉపరితల ఆవర్తనం ప్రభావంతో కరీంనగర్ జిల్లావ్యాప్తంగా శనివారం రాత్రి నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో చెరువులు, కుంటలు, జలాశయాలకు వరద పోటెత్తుతోంది. తిమ్మాపూర్ మండలం ఎల్‌ఎండీ జలాశయానికి ఎగువ ప్రాంతాలతోపాటు మిడ్ మానేరు రిజర్వాయర్ నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ఎల్‌ఎండీ నిండుకుండలా మారింది. అప్రమత్తమైన అధికారులు రిజర్వాయర్ దిగువ ప్రాంత ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు

43వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో..

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఎల్‌ఎండీ రిజర్వాయర్‌లోకి మోయతుమ్మెద వాగు ద్వారా భారీగా నీరు చేరుతోంది. మిడ్ మానేరు రిజర్వాయర్ నుంచి ఎల్‌ఎండీ ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరుతోంది. ఆదివారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి దాదాపు 43వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరిందని అధికారులు తెలిపారు. రాత్రి 9 గంటలకు ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టినట్లు అధికారులు తెలిపారు. ఎల్‌ఎండీ పూర్తి సామర్థ్యం 24 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 14.5 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రాజెక్టు ఈఈ నాగభూషణం, ఏఈ వంశీ కోరారు. పశువుల కాపరులు వాగులోకి రావొద్దని సూచించారు. పరివాహక ప్రాంతం వెంట గస్తీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.


రాజన్న దర్శనానికి వరుసలో భక్తులు


చిన్నారి కళాకారుల నాట్యం

రాజన్నకు రుద్రహోమం.. పూర్ణాహుతి

- వైభవంగా మాస శివరాత్రి
- వర్షంలో తడుస్తూ మొక్కులు చెల్లించుకున్న భక్తులు

వేములవాడ: వేములవాడ రాజన్న సన్నిధిలో మాస శివరాత్రి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఉదయం స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. స్వామివారి అద్దాల మంటపంలో రుద్రహోమం ఘనంగా జరిపారు. అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు. శ్రావణ మాసం ముగియనుండటంతో ఆదివారం భారీ వర్షాన్ని సైతం లెక్క చేయకుండా భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకుడు చంద్రగిరి శరత్‌శర్మ మాట్లాడుతూ.. ఈసారి శ్రావణ మాసం సోమవారం ఆరంభం కావడంతో ఈ మాసంలో ఐదు సోమవారాలు భక్తులకు కలసి వచ్చాయన్నారు. సోమవారాలు స్వామివారికి మహా లింగార్చన నిర్వహిస్తామని, మాస శివరాత్రి సందర్భంగానూ మహా లింగార్చన నిర్వహిస్తామని చెప్పారు. ఏర్పాట్లను ఆలయ ఈవో కొప్పుల వినోద్‌రెడ్డి, పర్యవేక్షకులు పరిశీలించారు.

రాజన్నకు నాట్య నివేదన

రాజన్నకు లంబోదర కల్చరల్ అకాడమీ కళాకారులు నాట్య నివేదన చేశారు. ఆలయ ఓపెన్ స్లాబ్‌లో శివపాద మంజీరనాదం నృత్య కార్యక్రమాలతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయ ఈవో కొప్పుల వినోద్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులు, కళాభిమానులు, లంబోదర కల్చరల్ అకాడమీ నిర్వాహకులు, భక్తులు, స్థానికులు పాల్గొన్నారు.


కోడె మొక్కు చెల్లించుకుంటున్న భక్తులు